సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



పచ్చ ఫలహారం..
ఉపాధి హామీ పథకం కింద పశువులు, జీవాలు, కోళ్లకు షెడ్లు మంజూరు చేశారు. వాటిని టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు.
- 8లో..



గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు
గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా మండల స్థాయి అధికారులను ఆదేశించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
37.6/28.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరు జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పోర్టులు, ఎయిర్‌పోర్టులకు భూములు సేకరిస్తాం
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లాలో పోర్టులు, ఎయిర్‌పోర్టులకు అవసరమైన భూములు సేకరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. గురువారం ప్రకాశం భవనంలో ఎంపీ మాగుంట, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావులతో పాటు ఇతర రెవెన్యూ అధికారులతో భూముల సేకరణపై చర్చించారు. గతంలో ప్రతిపాదించిన 723 ఎకరాల భూమిని పరిశీలించామని, త్వరలో ఈ భూములకు సంబంధించి అడ్డంకులను అధిగమించి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు సిద్ధం చేస్తామన్నారు. దీనిలో డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డి, కొత్తపట్నం తహశీల్దార్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఒంగోలు కమిషనర్‌గా వెంకటేశ్వరరావు




ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా కే.వెంకటేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనీల్ కుమార్ సింఘాల్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి జీఓ విడుదల చేశారు. కే.వెంకటేశ్వరరావు నర్సాపురం కమిషనర్‌గా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.జశ్వంత్‌రావును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

రంగు పడింది



జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం తూమాడు గ్రామ సచివాలయం ప్రహరీకి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గత నెల 28వ తేదీ ఎటువంటి అనుమతులు లేకుండా పచ్చరంగు వేశాడు. మరుసటి రోజు విధులకు వచ్చిన గ్రామ సచివాలయ సిబ్బంది పచ్చరంగు చూసి అవాక్కయి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. సదరు టీడీపీ నాయకుడిని రంగు మార్చమని చెప్పినా అతను ససేమిరా అనడంతో ఎటువంటి ఆదేశాలు ఇవ్వకుండా మిన్నకుండిపోయారు. గురువారం 'సాక్షి' దినపత్రికలో తూమాడు సచివాలయానికి పచ్చరంగు అన్న శీర్షికపై కథనం రావటంతో జిల్లా అధికారుల సూచనతో సచివాలయానికి రంగు మార్చాలని సిబ్బందికి ఎంపీడీవో జలజాక్షి ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటన పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఓఆర్డీ అంజలీదేవి హెచ్చరించారు. మండల అధికారుల ఆదేశాలతో గ్రామ సర్పంచ్ వాకా వెంకట నారాయణ రెడ్డి తన స్వంత నిధులతో సచివాలయ గోడకు తెల్లరంగు వేయించారు. గ్రామ సచివాలయం గోడ రంగు మారటంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బతికించే డాక్టర్లకు.. భద్రత ఇంతే!



ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ కరువైంది. ఆస్పత్రుల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు కరువవుతున్నాయి. పలు సందర్భాల్లో సెక్యూరిటీ వైఫల్యాలు ఎదురవుతుండడంతో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన కోల్‌కతా దురాగతం తర్వాత మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలంటే మహిళా వైద్యులు, నర్సుల రక్షణకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల నుంచి పీహెచ్‌సీల్లో భద్రతపై గురువారం 'సాక్షి' పరిశీలన చేసింది.

- ప్రభుత్వాస్పత్రుల్లో రక్షణ కరువు
- సెక్యూరిటీ అంతంత మాత్రమే
- వైద్యులు, వైద్య సిబ్బందిలో అత్యధికులు మహిళలే
- భయం..భయంగా రాత్రి పూట విధులు
- కీలక ప్రాంతాల్లోనూ సెక్యూరిటీ కరువు
- రక్షణ వ్యవస్థ పటిష్టం చేయాలని డిమాండ్

సెక్యూరిటీ పెంచాలి..

క్యాజువాలిటీ, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, గైనిక్ వార్డుల దగ్గరకు వచ్చిపోయే విజిటర్స్ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఎవరు వస్తున్నారో, ఎవరు పోతున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఇది ఆందోళన కలిగించే విషయం. విజిటర్స్ మీద ప్రణాళికబద్ధమైన నియంత్రణ అవసరం. వారికి ఒక రిజిస్టర్ ఏర్పాటు చేయడం, వీలైతే పాసులు జారీ చేయడం లాంటివి చేపట్టాలి. అప్పుడే మహిళా వైద్యులకు, మహిళా రోగులకు రక్షణ లభిస్తుంది. మెయిన్ గేటు దగ్గర కూడా సెక్యూరిటీ పెంచాలి.



– డా.శృతి, జూడా వైస్ ప్రెసిడెంట్

సాక్షిప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు టౌన్:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటుంది. రాష్ట్రంలోని అతిపెద్దదైన ప్రకాశం జిల్లాలో నిరుపేద, సామాన్య ప్రజలకు ఉన్న ఏకైక పెద్ద ఆస్పత్రి రిమ్స్. రోజూ ఇక్కడకు వైద్యం కోసం వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సుమారు 38 ఎకరాల్లో నిర్మాణమైన ఈ బోధనాస్పత్రి నగరంలో మధ్యలోనే ఉండడంతో చుట్టూ పక్కల గ్రామాల నుంచి వచ్చేవారే కాకుండా స్థానికులు సైతం చికిత్స కోసం ఇక్కడకు వస్తుంటారు. ఇది 500 పడకల ఆస్పత్రి అయినప్పటికీ అదనంగా మరో రెండు వందల పడకలతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే ప్రతి రోజు 800 నుంచి వెయ్యి మంది వరకు ఓపీ ఉంటుంది. ఇందులో 150 వరకు అత్యవసర కేసులు ఉంటాయి. దీంతో పాటు క్యాజువాలిటీ కూడా కిటకిటలాడుతుంటుంది. రెగ్యులర్ వైద్యులతో పాటుగా పీజీలు, హౌస్‌సర్జన్లు, సీనియర్ రెసిడెంట్లు ఇక్కడ వైద్య సేవలు అందిస్తుంటారు. రోగులు, రోగుల సహాయకులతో సహా వచ్చేవాళ్లు పోయేవాళ్లతో ఒక పెద్ద మాల్‌ను తలపిస్తుంటుంది. అయితే ఇక్కడ సెక్యూరిటీ లేకపోవడంతో అటు వైద్యులకు, ఇటు చికిత్స కోసం వచ్చే రోగులకు రక్షణ లేకుండా పోతోంది. ఆస్పత్రిలో తరచుగా రోగుల డబ్బులు చోరీకి గురవుతున్నాయంటే ఇక్కడ నిఘా వ్యవస్థ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సగానికిపైగా మహిళా వైద్యులే

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సగానికి పైగా లేడీ డాక్టర్లే. జూనియర్ వైద్యులలో కూడా వారిదే పైచేయి. పీజీలు 80 మంది ఉండగా వారిలో 60 మందికి పైగా మహిళలే ఉన్నారు. హౌస్ సర్జన్లు 150 మంది వరకు ఉండగా వారిలో కూడా అత్యధిక శాతం అమ్మాయిలే ఉన్నారు. ఒక షిఫ్ట్‌లో 35 మంది వరకు విధులను నిర్వహిస్తుంటారు. వీరితో పాటుగా స్టాఫ్ నర్సులు 376 మంది ఉన్నారు. ఆస్పత్రిలో మొత్తం సిబ్బంది 705 మంది ఉండగా వారిలో 50 శాతానికి పైగా మహిళా సిబ్బందే.



రిమ్స్ ప్రధాన ద్వారం వద్ద లేని సెక్యూరిటీ గార్డులు

జిల్లాలో 84 ప్రభుత్వ వైద్యశాలలు

జిల్లాలో మొత్తం 84 వైద్యశాలలు ఉన్నాయి. ఇందులో 64 పీహెచ్‌సీలు, 19 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, మరో రెండు ఏరియా వైద్యశాలలు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో 2019 కు ముందు వైద్యుల కొరత తీవ్రంగా ఉండేది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రాథమిక వైద్యశాలలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా వైద్యశాలలో ఒక్క ఖాళీ లేకుండా వైద్యులను నియమించారు. ఇప్పుడు పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున 128 మంది, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున 18 మంది వైద్యులు ఉన్నారు. వీరిలో కూడా అత్యధిక శాతం మహిళా వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. పల్లె సీమల్లోని పీహెచ్‌సీలు ఊరు చివరన ఉంటున్నాయి. చుట్టూ పొదలు, చెట్లు ఉంటున్నాయి. రాత్రి విధుల్లో ఉండే మహిళా డాక్టర్లు భయంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రక్షణ సైతం గాలిలో దీపంలాగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రుల్లో అటెండర్, వాచ్‌మెన్లను అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రుల్లో కొంత అభద్రతా భావం నెలకొందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

నామమాత్రంగా సెక్యూరిటీ

ఒంగోలులోని సర్వజన ఆస్పత్రిలోకి రెండు ప్రధాన గేట్లు ఉన్నాయి. ఔట్ గేట్, ఇన్‌గేట్ల నుంచి దగ్గర నామమాత్రంగా సెక్యూరిటీ ఉంది. తరచుగా ప్రైవేటు వాహనాలు సైతం లోపలికి వచ్చి పోతుంటాయి. ఎంతో కీలకంగా ఉండే లేబర్ రూం, క్యాజువాలిటీ, ఐసీయూ దగ్గర సైతం భద్రత అంతంత మాత్రమే. పగటి పూట మాత్రమే కాకుండా రాత్రి పూట కూడా ఇదే పరిస్థితి ఉండడంతో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ ఇబ్బంది పడుతున్నారు. మూడంతస్తుల ఈ భవనంలో రాత్రి పూట ఏ అంతస్తులోకి వెళ్లి చూసినా కనీసం ఒక్కరైనా సెక్యూరిటీ గార్డు కనిపించరు. వార్డుల బయట విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటి గుహలోకి వెళుతున్నట్లు భయానక పరిస్థితి ఉంది. క్యాజువాలిటీ, లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్ల వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బంది రాత్రి 10.30 గంటలు దాటిన తరువాత విధుల్లో ఉండకుండా వారికి కేటాయించిన ప్రత్యేక గదులకు వెళ్లి పడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. సెక్యూరిటీ సిబ్బందిలో సగానికి పైగా ఫిట్‌నెస్ లేని వారుండడం కూడా సమస్యగా మారిందని చెబుతున్నారు. వృద్ధులు, అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న వారిని సెక్యూరిటీలో పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను ముందుగా క్యాజువాలిటీకి తరలిస్తారు. రోగితో పాటుగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వెంట వస్తారు. క్యాజువాలిటీ దగ్గర కేవలం ఒకరిని మాత్రమే పెడుతున్నారని, అదికూడా మహిళలను మాత్రమే ఉంచుతున్నారని, దీంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ కేసుల్లో ఒక్కోసారి రోగి ప్రాణాలు పోయినప్పుడు రోగి తాలుకు బంధవులు గొడవలకు దిగడం, దాడులు చేయడం జరుగుతోంది.



ఒంగోలు రిమ్స్ క్యాజువాలిటీ వద్ద కనిపించని సెక్యూరిటీ

జూనియర్ డాక్టర్ల సమస్యలు పరిష్కరిస్తాం



జూనియర్ డాక్టర్ల సమస్యలన్నిటినీ పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. క్యాజువాలిటీ, గైనిక్ వార్డులతో పాటుగా ప్రతిరోజు రాత్రి మూడు సార్లు పోలీసులు పెట్రోలింగ్, అన్నీ వార్డుల్లో సెక్యూరిటీ పెంచడం, మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలాంటివి త్వరితగతిన చేపట్టేలా ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. ఆస్పత్రిలోని 95 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. అవసరమైతే మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. జూనియర్ డాక్టర్ల విశ్రాంతి కోసం ప్రత్యేకంగా 10 గదులు కేటాయించాం.

– డా.చెంచయ్య, ఇన్‌చార్జి ఆర్ఎంఓ, జీజీహెచ్

వసతులు అంతంతే..

అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూనియర్ డాక్టర్లు వైద్య సేవలు అందించే చోట వారికి ప్రత్యేక గదులు లేవు. ఒకటి అరా ఉన్నా వాటిలో వాష్‌రూంలు లేవు. వాష్ రూంలు ఉంటే అందులో నీటి సౌకర్యంలేదు. దాంతో అర్ధ రాత్రి డ్యూటీ వేళల్లో హాస్టళ్లకు వెళ్లాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. హాస్టళ్లకు వెళ్లే దారిలో వీధి దీపాలు లేకపోవడం, ఎలాంటి సెక్యూరిటీ లేకపోవడంతో మహిళా జూనియర్ డాక్టర్లు భయాందోళనలకు గురవుతున్నారు. మంచినీటి సౌకర్యం, విశ్రాంతి తీసుకోడానికి అనువైన వాతావరణం, మౌలిక వసతులు లేకపోవడంతో ప్రత్యేక గదులు దిష్టిబొమ్మలుగా తయారయ్యాయని జూనియర్ వైద్యులు మండిపడుతున్నారు. విరిగిపోయిన కిటికీ రెక్కలు, పాడైపోయిన ఏసీ, పేషంట్ల కోసం వాడే మంచాలు, దానిపైన వేసిన బెడ్లు తలచుకుంటేనే చిరాకెత్తే ప్రత్యేక గదులతో విశ్రాంతి సంగతి దేవుడెరుగు విసుగుపుట్టి పారిపోయే పరిస్థితుల మధ్య జూనియర్ డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు.



రిమ్స్ ఎమర్జెన్సీ వార్డులో నైట్‌డ్యూటీ డాక్టర్ రెస్ట్ రూం దుస్థితి ఇది

వైద్యులకు రక్షణకే మా ప్రాధాన్యత



జీజీహెచ్, వైద్య కళాశాల ఆవరణలో వైద్యులకు, ప్రధానంగా మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలన్నదే మా డిమాండ్. నైట్ డ్యూటీలో ఉన్నప్పుడు విశ్రాంతి కోరుకోవడం సహజం కనుక మాకు విశ్రాంతి గదులు కేటాయించాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. ఎలాంటి సమస్యనైనా చర్చించి పరిష్కరించేందుకు జాయింట్ యాక్షన్ కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నాం. ఇది నామమాత్రపు కమిటీగా మిగలకూడదని కోరుకుంటున్నాం. దీర్ఘకాలికంగా వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించే శాశ్వత వేదికగా పనిచేయాలన్నదే మా కోరిక.

– డా.అజయ్ కుమార్ రెడ్డి, జూడాల ప్రెసిడెంట్

మందుబాబులతో భయం వేస్తోంది

నైట్ డ్యూటీలో ఉన్నప్పుడు క్యాజువాలిటీకి వచ్చే రోగుల సహాయకుల్లో ఎక్కువగా మద్యం తాగి వస్తున్నారు. చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. చాలా భయంగా ఉంటుంది. అంతేకాకుండా ఎవరెవరో వస్తుంటారు. వారిలో నేరస్వభావం కలిగిన వ్యక్తులు కూడా ఉండవచ్చు. క్యాజువాలిటీ దగ్గర, ఆస్పత్రి ప్రధాన రహదారి వద్ద గట్టి సెక్యూరిటీని పెట్టాలి. మద్యం తాగిన వారిని ఆస్పత్రిలోనికి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలి.

– ఎస్ఎల్ ఎస్ లీలావతి, నర్స్

జూడాల సమస్యల పరిష్కారానికి జేఏసీ



జూడాల ప్రతినిధులతో చర్చిస్తున్న మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు

ఒంగోలు టౌన్: జూనియర్ డాక్టర్లు, వైద్యుల సంరక్షణకు, భద్రత, సౌకర్యాల ఏర్పాటుకు అన్నీ రకాల చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు తెలిపారు. జూడాల నుంచి వచ్చిన అన్నీ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన అనంతరం జూడాల ఉద్యమం నేపథ్యంలో గురువారం ప్రిన్సిపాల్ చాంబర్లో జూనియర్ డాక్టర్ల ప్రతినిధులతో చర్చలు జరిపారు. సుదీర్ఘంగా సాగిన చర్చల తరువాత ఆయన మాట్లాడుతూ జూడాల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ పాయింట్, హాస్టళ్ల వద్ద భద్రత, వీధి దీపాలు, డ్యూటీ ప్రదేశంలో మౌలిక వసతులు, భద్రతపై కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. కాలేజీ ఆవరణలో 50 సోలార్ లైట్లు మంజూరయ్యాయని, త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. యమర్జెన్సీ అలారం ఏర్పాటు చేయాలని జూడాలు అడిగారని, దానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. క్యాజువాలిటీ, ఐసీయూ, గైనిక్ రూంల వద్ద 24 గంటల మంచినీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. నైట్ డ్యూటీ చేస్తున్న సమయంలో విశ్రాంతి కోసం 10 గదులను కేటాయించారని, ప్రతి గదిలోనూ మంచినీటి కూలర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోగితోపాటుగా ఒకరు, లేదా ఇద్దరికి మాత్రమే అనుమతి ఇస్తారన్నారు. కుక్కలు ఆస్పత్రిలోకి రాకుండా కార్పొరేషన్ అధికారుల సహకారంతో చర్యలు చేపడతామని, ఆస్పత్రి ఆవరణలో కుక్కలకు ఫీడింగ్ ఆపేందుకు సెక్యూరిటీకి ఆదేశాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. గరల్స్ హాస్టల్ వద్ద గేటు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జూనియర్ డాక్టర్ల అంతర్గత సమస్యలపై వివిధ విభాగాల అధిపతులతో జాయింట్ యాక్షన్ కమిటీ వేసినట్లు వెల్లడించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డా.దుర్గాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.నామినేని కిరణ్, డా.ప్రభాకర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ డా.సుధాకర్, సీఎస్ఆర్ఎంఓ డా.చెంచయ్య, జూడాల ప్రతినిధులు డా.అజయ్ కుమార్ రెడ్డి, డా.శృతి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సిద్ధం

ఒంగోలు టౌన్: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి అత్యవసర సేవలు అందించడానికి జూనియర్ డాక్టర్లు నిర్ణయం తీసుకున్నట్లు జూడాల ప్రసిడెంట్ డా.అజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. జాతీయ నాయకుల నిర్ణయం ప్రకారం తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గురువారం జీజీహెచ్ ఆవరణలో జూనియర్ డాక్టర్లు నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేకూర్చాలని, వైద్యుల పరిరక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టం తీసుకొని రావాలని, వైద్యుల మీద దాడులు చేయకుండా కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. మహిళా వైద్యులకు పనిప్రదేశాల్లో రక్షణ, సౌకర్యాలు కల్పించాలని కోరారు. 10 డిమాండ్లతో కూడిన లేఖను ప్రిన్సిపాల్ కు అంజేశామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు, హెచ్ఓడీలతో కూడిన జాయింట్ కమిటీ వేసినట్లు తెలిపారు. ఈ కమిటీతో ఒంగోలులోని జూడాల సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నామన్నారు. ఈ దీక్షల్లో జూడా కమిటీ నాయకులు బి.శృతి, ఓ.చైతన్య సాయి, విష్ణుప్రియ, అవినాష్ కుమార్, సాయి పవిత్ర, రాము, సత్య సాయి, హర్షిత, చరణ్, మాధవి పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

అక్రమంగా ఇసుక విక్రయిస్తే కఠిన చర్యలు

- సెప్టెంబర్ 11న కొత్త ఇసుక పాలసీ
- ప్రస్తుతం జిల్లాలో 4 వేల టన్నుల ఇసుక నిల్వలు
- విలేకర్ల సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం అందించే ఇసుకను ఎవరైనా అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. గురువారం ప్రకాశం భవనంలో ఎస్పీ దామోదర్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఇసుకకు సంబంధించి జిల్లాలో మూడు ప్రాంతాల్లో నిల్వలు ఉన్నాయన్నారు. ఒంగోలులో ఒకటి, జరుగుమల్లిలో రెండు ఇసుక సరఫరా కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. వీటిలో 4 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. సెప్టెంబర్ 11వ తేదీ కొత్త ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. అప్పటి వరకు ఇసుక అవసరమైన వాళ్లు ముందుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. బుకింగ్ అయిన తర్వాత టైం స్లాట్ ఇస్తారని తెలిపారు. ఆ టైం ప్రకారం మాత్రమే వాహనాలను అనుమతిస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు, గుంటూరు, కడప జిల్లాల నుంచి కూడా ఇసుకను తెప్పిస్తున్నామన్నారు. ఇసుక సరఫరాకు సంబంధించి మానిటరింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారన్నారు. కొత్త పాలసీ వచ్చిన తర్వాత గుండ్లకమ్మ, పాలేరు, ముసి నదుల్లోని ఇసుక రీచ్‌లను వినియోగంలోకి తెస్తామని చెప్పారు. ఉచిత ఇసుక పంపిణీపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్లు 1800 599 4599, 62817 99518 అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఇసుక అధిక ధరలకు విక్రయించినా, అక్రమ రవాణా చేసినా వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణాకు వినియోగించే వాహనదారులు తప్పనిసరిగా బుకింగ్ ఆర్డర్ తీసుకుని టైం స్లాట్ ప్రకారం మాత్రమే ఇసుక నిల్వల వద్దకు రావాలని ముందుగా వస్తే అనుమతించమన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్నే పండించండి
- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: ధాన్యం సాగుచేసే రైతులు ప్రభుత్వం కొనుగోలు చేసే రకాలు మాత్రమే పండించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వీసీ సమావేశపు మందిరంలో గురువారం వ్యవసాయ అనుబంధ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు కురవటం వలన నాగార్జున సాగర్ ఆయకట్టులో వరి పండించే అవకాశం ఉన్నందున రైతులు పండించటానికి అనువైన రకాల గురించి అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. ప్రభుత్వం కొనుగోలు చేసే రకాలైన బీపీటీ 5204, ఎన్ఎల్ఆర్ 33892, బీపీటీ 2782, బీపీటీ 2270, ఎంటీయూ 1262, 1156,1153, 1121, ఎన్ఎల్ఆర్ 34449, ఎన్‌డీఎల్ఆర్ 7 సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు కోరారు. ప్రభుత్వం కొనుగోలు చేయని రకాలు బుడ్డలు (సీఆర్ఐ1009), ఎంటీయూ 1010, 1001, ఎన్ఎల్ఆర్ 145 రకాలు పండించి నష్టపోవద్దని సూచించారు. ఏపీ సీడ్స్ మేనేజర్ కే బుజ్జమ్మ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అనవసరమైన రకాలు సాగు చేసి మోసపోవద్దని కమిటీ సభ్యులు సూచించారు. శాస్త్రవేత్తలు రమేష్, సంధ్యారాణి, వర ప్రసాద్, పౌర సరఫరా శాఖ అధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు రుణాలు అందించాలి



జేడీ అర్చనకు వినతిపత్రం అందిస్తున్న కాలేషా

ఒంగోలు సెంట్రల్: జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ) ద్వారా రుణాలు అందించేందుకు దివ్యాంగుల నుంచి వెంటనే దరఖాస్తులు స్వీకరించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. ఆ మేరకు దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా జేడీ అర్చనను గురువారం స్థానిక జేడీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించాలని రెండు నెలల క్రితం కూడా కోరినట్లు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి దివ్యాంగులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి గౌరవాధ్యక్షుడు బాణవతే వెంకటేశ్వరరావు, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత అందిపుచ్చుకోవాలి

● జీసీడీఓ ప్రమోద



బేస్‌లైన్ పరీక్షలను పరిశీలిస్తున్న జీసీడీఓ

కొనకనమిట్ల: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని పరీక్షలకు సిద్ధం కావాలని జీసీడీఓ ప్రమోద అన్నారు. మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో సీబీఎస్ఈ విధానంలో నిర్వహిస్తున్న బేస్‌లైన్ యూనిట్ పరీక్షలను పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖతో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సీబీఓస్ఈ విధానానికి దోహదపడేలా సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వం డిజిటల్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని, ట్యాబ్‌లను తనిఖీ చేశారు. ట్యాబ్‌ల వాడకం గురించి విద్యార్థులకు సూచనలు, సలహాలు చేశారు.

రికార్డులు పరిశీలన..

అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న క్లాసులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పతో తరగతిలో ఈ ఏడాది మంచి ఫలితాలు రావటానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పొగాకు గరిష్ట ధర రూ.359



పొదిలిలో అమ్మకానికి సిద్ధంగా పొగాకు బేళ్లు

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని వేలం కేంద్రాల్లో గురువారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు గరిష్ట ధర రూ.359 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రీజియన్ పరిధిలోని 11 పొగాకు వేలం కేంద్రాల్లో గురువారం నిర్వహించిన వేలానికి 10,585 బేళ్లు రాగా, వాటిలో 8,925 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,660 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు వేలం కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 137వ రోజు వేలానికి 5,609 బేళ్లు రాగా, 4,899 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 710 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.308.68 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 131వ రోజు నిర్వహించిన వేలానికి 4,976 బేళ్లు రాగా, వాటిలో 4,026 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 950 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.299.81 పలికింది.

25న జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు: జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఈనెల 25న జిల్లా స్థాయి శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఏపీ జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ప్రతినిధి జి.నివేదిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మారిన జీవశాస్త్ర పదో తరగతి పాఠ్యగ్రంథం, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ బోర్డు నిర్వహించబోయే పదో తరగతి పరీక్ష విధానాల గురించి తగిన సూచనలతో శిక్షణను ఇస్తారన్నారు. స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన భవన్‌లో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఈఓ డి.సుభద్ర ముఖ్యఅతిథిగా హాజరవుతారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జీవశాస్త్ర ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

పచ్చ ఫలహారం

ప్రజా సంక్షేమం అంటే చంద్రబాబుకు ఏమాత్రం పట్టదు. ప్రజల కోసం పావలా ఖర్చు చేయాలంటే వెనుకాడే బాబు..తమ పార్టీ నేతలు దోచుకునేందుకు మాత్రం అడ్డగోలు పథకాలు ప్రవేశపెట్టి నిధులు మంజూరు చేస్తారు. 2018లో గోకులాల పేరుతో టీడీపీ కార్యకర్తలకు షెడ్లు మంజూరు చేయగా..తాజాగా ఉపాధి హామీ పథకం నిధులను షెడ్ల నిర్మాణానికి మంజూరు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలు వంటివి గ్రామాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. కానీ కూటమి ప్రభుత్వం కేవలం పార్టీ కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా 90 శాతం సబ్సిడీతో షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- జిల్లాలో ఉపాధి హామీ నిధులతో 1,075 షెడ్లు మంజూరు
- 2018లో గోకులాల పేరుతో షెడ్ల నిర్మాణం
- అప్పట్లో టీడీపీ కార్యకర్తలకే షెడ్లు కేటాయింపు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాల నిర్మాణం
- నేడు పచ్చనేతల పశువులు, సన్నజీవాలు, కోళ్లకు షెడ్లు మంజూరు



గతంలో నిర్మించిన గోకులం షెడ్డు

బేస్తవారిపేట: టీడీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును అప్పనంగా బొక్కేసేందుకు మళ్లీ పథకాలు సిద్ధం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగింది. కానీ టీడీపీ ప్రభుత్వం మాత్రం ప్రజల సొమ్మును స్వాహా చేయడమే లక్ష్యంగా పథకాలు రూపొందిస్తోంది. తాజాగా ఉపాధి హామీ పథకం నిధులతో షెడ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2018లో సైతం నిబంధనలతో సంబంధం లేకుండా టీడీపీ కార్యకర్తలకే షెడ్లు మంజూరు చేశారు.పశువులు, సన్నజీవాలు, కోళ్లకు షెడ్లు నిర్మాణాలు చేపట్టింది. ప్రస్తుతం 2024లో కూడా అదే తరహాలో తమ కార్యకర్తలకు షెడ్లు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాకు 1,075 షెడ్లు మంజూరు

జిల్లాలో 38 మండలాలకు 1,075 షెడ్లు మంజూరయ్యాయి. ఒక్కో మండలానికి 25 షెడ్లు మంజూరు చేశారు. తీర ప్రాంతంలోని కొత్తపట్నం, నాగులుప్పలపాడు, ఒంగోలు, సింగరాయకొండ, టంగుటూరు మండలాలకు 50 షెడ్లు చొప్పున కేటాయించారు. షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తుండటం, లబ్ధిదారుడు కేవలం 10 శాతం మాత్రమే చెల్లించాల్సి ఉండటంతో టీడీపీ కార్యకర్తలు వాటి కోసం పోటీ పడుతున్నారు.

పంచాయతీ తీర్మానం తప్పనిసరి

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మిస్తున్న ఈ షెడ్లకు గ్రామ పంచాయతీ తీర్మానం తప్పనిసరిగా ఉండాలి. గతంలో చేసినట్లుగా ఈ సారి కూడా టీడీపీ కార్యకర్తలకే షెడ్ల మంజూరు కోసం అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. టీడీపీ కార్యకర్తల దరఖాస్తులకే తీసుకోవాలని కొందరు అధికారులపై పచ్చనేతలు తీవ్రంగా ఒత్తిడి తీసుకువస్తున్నారు. గ్రామ సభలు నిర్వహించి ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాల్సిన బాధ్యత, పర్యవేక్షణ ఉపాధిహామీ అధికారులకు అప్పగించారు. పంచాయతీ తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలి. దరఖాస్తుదారుడు నిజమైన లబ్ధిదారుడా కాదా.. పశువులు ఉన్నాయా..లేదా అని పరిశీలించి యూనిట్ల ఎంపిక బాధ్యతను పశువైద్యాధికారులకు అప్పగించారు.

ఆదర్శం..ఆ పాలన..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించింది. పట్టణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా స్థానికంగానే సమస్యల పరిష్కారం కోసం, ప్రజలు వ్యయప్రయాసలకు గురికాకుండా ఉండేందుకు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాల ఏర్పాటు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. కానీ టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి వాటిని పట్టించుకోకుండా తమ కార్యకర్తల కోసం షెడ్లు మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

షెడ్ల రకాలు...సబ్సిడీ వివరాలు

షెడ్లు	యూనిట్ ధర	సబ్సిడీ (90 శాతం)	రైతు వాటా (10%)
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 పశువులు	2,30,000	2,07,000	23,000

సన్నజీవాలకు షెడ్లు

షెడ్లు	యూనిట్ ధర	రూ.సబ్సిడీ (70 శాతం)	రైతు వాటా (30%)
20 గొర్రెలు లేక మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్ల షెడ్డు	87,000	60,900	26,100
200 కోళ్ల షెడ్డు	1,32,000	92,400	39,600



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ఆర్‌బీకే సెంటర్

కార్మిక చట్టాలు రద్దు చేస్తే సహించం

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

మార్కాపురం: బీజేపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రవీంద్రనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కాపురంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలు వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 42 కార్మిక చట్టాలకు తూట్లు పొడిచిందని, నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లు అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్‌లను తొలగించాలని సమావేశంలో డిమాండ్ చేస్తామన్నారు. అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం మోదీ ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పే బీజేపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమై, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, ఎల్ఐసీ, స్టీల్ ప్లాంట్, పోస్టల్, పౌర విమానయాన శాఖలను నష్టాల బాట చూపుతూ అంబానీ, అదానీలకు అమ్మేస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక వ్యతిరేక విధానాలతో చాలా పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల గురించి సమగ్రంగా చర్చించి భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకునేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. విశాఖలో జరిగే కార్యక్రమానికి 29 రాష్ట్రాల నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాశీం పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న దూదేకుల ఖాశింవలి

రాచర్ల: అప్పుల బాధ తట్టుకోలేక పొలంలోనే పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఆరవీటికోటలో జరిగింది. ఏఎస్సై వై.ఆదిశేషయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అకవీడు పంచాయతీ పరిధిలోని ఆరవీటికోట గ్రామానికి చెందిన దూదేకుల ఖాశింవలి (35) అనే రైతు తనకున్న 75 సెంట్ల పొలంతో పాటు 2.15 ఎకరాలను కౌలుకు తీసుకొని మిరప, పత్తి పంటలు సాగు చేశాడు. అయితే వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ కావడంతో పాటు అప్పులు కూడా పెరిగిపోయాయి. దీంతో అప్పుల బాధ తట్టుకోలేక పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గమనించి స్థానికులు 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఖాశింవలికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఏఎస్సై వై ఆదిశేషయ్య సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసారం ఆధారంగా ఎరువుల వినియోగం

● జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ



ఎరువుల వినియోగంపై రైతులకు కరపత్రాలు అందిస్తున్న వ్యవసాయాధికారులు

చీమకుర్తి: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ సూచించారు. ఎరువుల వినియోగంపై జిల్లా వ్యవసాయాధికారులతో కలిసి మండలంలోని మువ్వావారిపాలెం, బూసురపల్లి గ్రామాల్లో రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ 2024–25 ఫార్మర్ ఓరియెంటెడ్ యాక్టివిటీ కింద ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్ష ఫలితాలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వాడటం వలన నేల, గాలి కాలుష్యం అవుతున్నాయని తెలిపారు. రైతులకు ఖర్చులు కూడా పెరుగుతున్నాయన్నారు. దానిని నివారించడానికి సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు, వేప కషాయాలను వినియోగించాలన్నారు. ఎరువుల వినియోగంపై రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి వ్యవసాయ అధికారులు శైలజారాణి, సుధారాణి, డీవీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పాదక రంగం వైపు రైతులు రావాలి

● ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు



రైతులతో కలిసి పొలాలను పరిశీలిస్తున్న ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు

మద్దిపాడు: రైతులు విద్యుత్ ఉత్పాదక రంగం వైపు రావాలని ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ డి.సుబ్బారావు పిలుపునిచ్చారు. మద్దిపాడు సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పంటలు పండించుకోవడానికి నీరు ప్రధానంగా మారిందని తెలిపారు. ప్రత్యేకంగా ప్రకాశం జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న క్రమంలో సాగునీటికి పూర్తిగా బోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పాదకతను పెంచడానికి ఏపీసీపీడీసీఎల్ తీసుకున్న నిర్ణయాలలో భాగంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న రైతులు వారి పొలాల్లో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడానికి కార్పొరేషన్‌కు లీజుకిస్తే ఎకరాకు రూ.30 వేలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. లీజును రెండు సంవత్సరాలకు ఒకసారి రెగ్యులర్ చేస్తూ పొడిగిస్తామని తెలిపారు. ఐదు సంవత్సరాల కాలపరిమితిలో వ్యవసాయదారుడు వద్దు అనుకుంటే వారికి పొలం తిరిగిస్తామని చెప్పారు. ప్రతి రెండు సంవత్సరాలకు లీజును ఐదు శాతం పెంచడానికి అనుమతులు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో రైతులు వారి పొలాల్లో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడానికి అనుమతిస్తే వారికి ఆదాయం కూడా కలుగుతుందన్నారు. ఇప్పటికే మద్దిపాడు నుంచి నందిపాడు వెళ్లేదారిలో సుమారుగా 30 ఎకరాల వరకూ లీజుకు ఇవ్వడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇంకా రైతులెవరైనా తమ పొలాల్లో సౌరవిద్యుత్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉంటే పాస్ పుస్తకాలతో విద్యుత్‌శాఖ స్థానిక ఏఈని కలవాలని సుబ్బారావు సూచించారు. ఆయన వెంట ఒంగోలు ఎస్ఈ వీవీ సత్యనారాయణ, ఈఈ పీ శ్రీనివాసులు, డీఈఈ ఆర్.మోహనరావు, మద్దిపాడు ఏఈ ఆర్ఆర్ చెన్నారెడ్డి, మద్దిపాడు మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం చెరువులో నైజీరియా పక్షులు



మార్కాపురం చెరువులో ఉన్న నైజీరియా పక్షులు

మార్కాపురం: పట్టణంలోని చెరువులో గత నాలుగు రోజుల నుంచి నైజీరియా పక్షులు సందడి చేస్తున్నాయి. గతంలో కొల్లేటి సరస్సు, నేలపట్టు సరస్సులకే పరిమితమైన ఈ పక్షులు మొదటిసారిగా మార్కాపురం రావడంతో పక్షి ప్రేమికులు, పట్టణ ప్రజలు వాటిని వింతగా చూస్తున్నారు. చెరువు కట్టపై ప్రయాణించే వారు వాహనాలు ఆపి పక్షులను చూస్తూ కాసేపు కాలక్షేపం చేస్తున్నారు. నైజీరియా పక్షుల కిలకిలరావాలు వింటూ అవి చేసే సందడిని తిలకిస్తూ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. నైజీరియా, సైబీరియా, ఆస్ట్రేలియా దేశాల నుంచి వేలాది కిలోమీటర్లు ప్రయాణించి ఈ పక్షులు వస్తున్నాయి. మార్కాపురం చెరువులో అరకొరగా అడుగంటి ఉన్న నీటిలో చేపలు పట్టుకుని తింటూ వయ్యారాలు ఒలకబోస్తూ ఆకట్టుకుంటున్నాయి.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, అందుకోసం గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 23వ తేదీ గ్రామసభలు నిర్వహించనున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపాధి పనులు, తాగునీరు, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం తదితర అంశాలపై ప్రజలతో చర్చించి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కుటుంబం ఎల్‌పీజీ గ్యాస్ వినియోగించుకునేలా చూడాలన్నారు. జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయిన 8 మండలాల పరిధిలోని 57 గ్రామాల్లో నీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ ఉషారాణి, డ్వామా పీడీ అర్జునరావు, జెడ్పీ సీఈఓ మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, పశుసంవర్థకశాఖ జేడీ బేబీరాణి, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హార్టీకల్చర్ కేంద్రంగా పశ్చిమ ప్రాంతం

ఒంగోలు అర్బన్: జిల్లాలో హార్టీకల్చర్‌ను ప్రోత్సహించాలని ముఖ్యంగా పశ్చిమ ప్రాంతాన్ని హార్టీ కల్చర్ కేంద్రంగా మార్చాలని ఆ దిశగా ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. గురువారం ప్రకాశం భవనంలో హార్టీకల్చర్, మైక్రో ఇరిగేషన్ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా సమీక్షించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటల విస్తీర్ణం, నీటి విస్తీర్ణాన్ని పెంచేందుకు ఉన్న అవకాశాలు, సబ్సిడీపై ఇస్తున్న పరికరాలు, పథకాలపై సంబంధిత అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు అధిగమించేలా సూచనలు, సాంకేతిక సలహాలు అందజేయాలన్నారు. రాబోయే ఐదేళ్లలో ఉద్యాన పంటల సాగులో జిల్లా ముందుండాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు నెలాఖరుకి సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. దీనిలో ఉద్యానవన శాఖ అధికారి గోపిచంద్, ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ, ఎంహెచ్ఓలు, ఎంఐఏఓలు పాల్గొన్నారు.

100 రోజులు పని కల్పించాలి

● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ



సూరారెడ్డిపాలెంలో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణతేజ

టంగుటూరు: ఉపాధి హామీ కూలీలకు 100 రోజులు పని కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ అన్నారు. మండలంలోని సూరారెడ్డిపాలెం పంచాయతీలో ఉపాధి హామీ ఫీల్డ్ చానల్ పనిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ రోజు కూలి రూ.300 రావాల్సి ఉండగా రూ.231 పొందుతున్నారన్నారు. సిబ్బంది చెప్పిన కొలతల ప్రకారం పని చేస్తే రూ.280 కనీసం పొందవచ్చని తెలిపారు. ఈ నెల 23న గ్రామసభల్లో గోకులం షెడ్ల నిర్మాణానికి తీర్మానం పొంది అంచనాలు తయారు చేయాలని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈలను సూచించారు. అనంతరం జయవరం రైతు పొలంలో మొక్కలు నాటారు.

కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జునరావు, జెడ్పీ సీఈఓ, డీపీఓతో పాటు వాటర్ షెడ్ ఏపీడీ వందరమన్, ఉపాధి హామీ ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీఓ రత్నజ్యోతి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.